క్లుప్తంగా

వాకర్స్ క్లబ్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళి

మురళీనగర్: వాకర్స్ క్లబ్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం క్లబ్ కార్యవర్గం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యత్వాలను పెంచుతూ విరాళాల సేకరణ ద్వారా ఆర్థిక పరిపుష్టతను చేకూరుస్తామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 10 మంది సభ్యులు చేరడం ద్వారా రూ.50,000 నిధులు సమకూరినట్లు చెప్పారు. ఆర్థిక ప్రగతితో అత్యధిక స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చనేది తమ ప్రధాన ఆశయంగా వివరించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులకు చంద్రమౌళి అభినందనలు తెలిపారు. ఈ నెల 21న ప్రపంచ మాతృ భాషాదినోత్సవం, 24న ఉచిత వైద్య శిబిరం, మార్చి 8న ప్రపంచ మహిళా దినోత్సవం, 9న నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, కె.ద్వారకానాథ్, కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి కూర్మారావు, సబ్బినేని రామ్మోహనరావు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరి వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5.30 గంటలకు వైభవుడి ఉత్సవ విగ్రహంతో భక్తులు, అర్చకులు మేళతాళాల మధ్య ఆలయ ప్రదక్షిణ చేశారు. సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళా శాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం అలివేలు మంగ అన్నదాన సత్రంలో 300 మంది భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందించారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పార్కుకు పూర్వవైభవం

- ఇందిరాగాంధీ ఉద్యానవనానికి మహర్దశ
- రూ.8 లక్షలతో ఆధునికీకరణ
- శరవేగంగా అభివృద్ధి పనులు



పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు

ఇది కదా అభివృద్ధి



నక్కవానిపాలెం ఇందిరాగాంధీ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్సార్ విగ్రహం

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందే. గత పాలకుల నిర్లక్ష్యంతో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పార్కులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్వవైభవాన్ని తీసుకొస్తోంది. ఇందులో భాగంగా 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఇందిరాగాంధీ ఉద్యానవనానికి మహర్దశ పట్టింది. జీవీఎంసీ నిధులు రూ.8 లక్షలతో ఈ పార్కును ఆధునికీకరిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

నాడు కొరవడిన పర్యవేక్షణ..

1985లో నక్క రామకృష్ణారెడ్డి కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు నక్కవానిపాలెంలో ఇందిరాగాంధీ పార్కు నిర్మాణం చేపట్టారు. 1993లో నాటి రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి బలిరెడ్డి సత్యారావు, ఇందిరాగాంధీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు నక్క రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్కులో ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మొదట్లో ఈ ఉద్యానవనం స్థానికులు, సందర్శకుల రాకతో సందడిగా కళకళలాడుతూ ఉండేది. కాలక్రమేణా కొన్నేళ్లుగా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పార్కులోని బెంచీలు, వస్తువులు క్రీడా సామగ్రి తుప్పుపట్టి పాడైపోయాయి. సాయంత్రం వేళలో స్థానికులు కూర్చోడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. పార్కులోని వస్తువులన్నీ పాడైపోవడంతో కళావిహీనంగా తయారైంది. దీంతో ఎప్పుడు చూసినా పార్కుకు తాళం వేసి ఉండేది.

90 శాతం పనుల పూర్తి..

ఈ పార్కుకు పూర్వవైభవం తీసుకొచ్చేలా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే 90 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశారు. స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే స్టీల్ గేట్లు, పార్కు లోపల ఫుట్‌పాత్‌ల పనులను పూర్తి చేశారు. ఇందిరాగాంధీ విగ్రహం పక్కనే దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారు. వేమన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసి వాటి ప్రారంభోత్సవాలకు నిర్వహణ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో మరికొద్ది రోజుల్లోనే ఈ పార్కుకు నూతన వెలుగులు రానున్నాయి.

అయోధ్య రాముడి పాదుకల ఊరేగింపు



సీతంపేటలో రథయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



ఊరేగిస్తున్న అయోధ్య రాముడి పాదుకలు

సీతంపేట: షిర్డీసాయిబాబా భజన సేవా మండలి ఆధ్వర్యంలో శనివారం 25వ వార్డు సీతంపేటలో అయోధ్య రాముడి పాదుకల రథయాత్ర వైభవంగా జరిగింది. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆర్థిక సాయతో జరిగిన ఈ ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సీతంపేట రాధాకృష్ణ మందిరం నుంచి దుర్గాగణపతి ఆలయం వరకు యాత్ర కొనసాగింది. కార్పొరేటర్ గోవింద్ ప్రారంభించిన ఈ యాత్రలో సారిపిల్లి గంగరాజు, బోర వెంకటరమణ, నమ్మి వెంకట్, సన్నీ, గుడివాడ గౌరినాయుడు, భజన మండలి సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

25న వెలగాడ కోటకు మోటార్ సైకిల్ యాత్ర

బీచ్‌రోడ్డు: చారిత్రక కొండ వెలగాడ కోటకు మోటార్ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా కార్యదర్శి మజహర్ ఇబ్రహీం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న వెలగాడ కోటకు ఆర్కే బీచ్ నుంచి మోటార్ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం రాజులు ఆయుధ పూజ నిర్వహించే ఈ కోటను సందర్శించేందుకు వీలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటలకు ఆర్కే బీచ్ నుంచి ప్రారంభమై ఈ యాత్ర సాయంత్రానికి తిరిగి నగరానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ యాత్రలో పాల్గొనాలనుకునేవారు 94400 42366 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ప్రాజెక్టుల నిర్వహణకు ఆహ్వానం



డాక్టర్ విజయ్ భావరాజును సత్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులు చేపట్టాలని అమెరికాకు చెందిన ఈటాస్ రీసెర్చ్ ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపాల్ ఇంజినీర్ డాక్టర్ విజయ్ భావరాజును ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్వాగతించి సత్కరించారు. శనివారం ఏయూను సందర్శించిన ఆయనతో వీసీ కార్యాలయంలో భేటీ అయ్యారు. క్రిటికల్ టెక్నాలజీస్, ఏయూ నిర్వహిస్తున్న పలు స్టార్టప్‌లకు తాను మార్గదర్శకం వహిస్తానని డాక్టర్ విజయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి చాలెంజెస్ ఇన్ మోడరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ ద ఎమర్జింగ్ క్లైమేట్ ఇష్యూస్ అనే అంశంపై ప్రసంగించారు. విభాగ ఆచార్యులు పరిశోధన రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై చర్చించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

'సింహాద్రి'లో ఎంవోసీ నాగరాజు



యాష్ పాండ్‌ను సందర్శిస్తున్న అడిషినల్ సెక్రటరీ నాగరాజు, అధికారులు

పరవాడ: పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీని భారత ప్రభుత్వ అడిషినల్ సెక్రటరీ (ఎంవోసీ) నాగరాజు శనివారం సందర్శించారు. సముద్రిక అతిథి గృహం నాగరాజుకు వద్ద సంస్థ ఓ అండ్‌ఎం జీఎం డీపీ పాత్ర, టెక్నికల్ సర్వీసెస్ జీఎం పద్మప్రియ స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా తొలుతగా సంస్థకు చెందిన మోడల్ ప్లాంటు, మెయిన్ ప్లాంటు కంట్రోల్ రూం, యాష్ డేక్ ఏరియా, వ్యాగన్ టింప్లర్ ఏరియా, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు, సీవాటర్ పంప్ హౌస్‌లను సందర్శించారు. ప్లాంటు పనితీరును అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన ఆపరేషన్ జీఎం టి.రాజగోపాలన్, ఫైనాన్స్ జీఎం కె.జె.రావు, హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర పాల్గొన్నారు.

నేడు ఎరుకుమాంబ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి సన్నిధిలో ఆలయ చైర్మన్, ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి.రమాబాయి తెలిపారు. ప్రస్తుతం ఉన్న అమ్మవారి విగ్రహం వెనుక భాగాన ప్రతిష్ట చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి శనివారం గణపతి పూజ, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఊరేగింపు అనంతరం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ధర్మకర్తలు పిల్లి స్వాతి, పి.లక్ష్మీనారాయణమ్మ, పిల్లి దుర్గ, దళాయి అన్నపూర్ణ, పెద్దాడ రమణమ్మ, బంటుపల్లి సూర్యనారాయణ, కె.బ్రహ్మాజీ, శరగడం నర్సింగరావు, ప్రధాన అర్చకుడు గంగవరపు శ్రీనివాసరావు, సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

20న భీష్మ ఏకాదశి..

ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 20న భీష్మ ఏకాదశి పర్వదినం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి.రమాబాయి తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు భీష్మ ఏకాదశి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా హరిహర నామ సంకీర్తన ఏకాహ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం ఉదయం 6 గంటల (24 గంటల) పాటు భక్తి గీతాలాపన కార్యక్రమం జరుగతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవాలని ఈవో కోరారు.

ఆస్ట్రేలియాలో విద్యపై అవగాహన సదస్సు రేపు

బీచ్‌రోడ్డు: ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డే సందర్భంగా ఆ దేశంలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి అవగాహన కల్పించేందుకు సోమవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎక్స్‌పర్ట్స్ సంస్థ మేనేజర్ అనిత కొమ్మరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఒక హోటల్లో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో టాప్ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందే విధంగా, వీసా సర్వీస్, స్కాలర్‌షిప్స్ ఎలా పొందాలి అనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 77859 68968 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాయుడు, శారన్, సైదా, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా వసతి గృహాలకు రోటరీ క్లబ్ వితరణ

- రూ.2.6 లక్షల విలువైన బెడ్స్, ఫ్యాన్లు, వివిధ మెషీన్ల అందజేత



సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అల్లిపురం: మహిళా సాధికారతే లక్ష్యంగా రోటరీ డిస్ట్రిక్ట్ 3020 ద్వారా ఇచ్ఛాపురం నుంచి అమరావతి వరకు గల ప్రభుత్వ వసతి గృహాలు, ట్రెనింగ్ సెంటర్లు, పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు శనివారం హోటల్ దసపల్లాలో జరిగిన కార్యక్రమంలో రూ.2.6 లక్షల విలువ గల మెటీరియల్‌ను రోటరీ క్లబ్ పోర్టు సిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌కు 100 బెడ్స్, పది సీలింగ్ ఫ్యాన్స్, ఓల్డ్ డైరీఫామ్ గవర్నమెంట్ జువైనల్ వెల్ఫేర్ హోమ్‌కు 40 బెడ్స్, ఆరిలోవ మహిళా ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్‌కు సూయింగ్ మిషన్లు, జిగ్ జాగ్ సూయింగ్ మిషన్, సాగర్‌నగర్, ప్రభుత్వ అంధ బాలికల హాస్టల్‌లోని 18 మంది బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డీవీ వర్మ, అధ్యక్షుడు జి.విశ్వనాథ్, మాజీ అధ్యక్షుడు జీఎఫ్ రాజు, కార్యదర్శి ఎస్ఎన్ రాజు, కోశాధికారి కేవీ రమణ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'

- హీరో దీపక్ సరోజ్



మీడియాతో మాట్లాడుతున్న హీరో దీపక్ సరోజ్, హీరోయిన్ తన్వి, కీర్తన

అల్లిపురం: యదార్థ సంఘటన ఆధారంగా యువతకు సందేశాత్మకమైన చిత్రంగా సిద్ధార్థ్ రాయ్ నిర్మించినట్టు ఆ చిత్ర హీరో దీపక్ సరోజ్ అన్నారు. ఈ సినిమా తన కెరీర్‌లో బెస్ట్‌గా నిలుస్తుందన్నారు. ఈ నెల 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని చెప్పారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపక్ మాట్లాడుతూ యశస్వి దర్శకత్వంలో బెంగాల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలిపారు. ఎటువంటి ఎమోషన్స్ లేకుండా తిండి, నిద్ర, రొమాన్స్ మాత్రమే కావాలనుకునే యువకుడు.. ప్రేమకు ఎలా లొంగిపోయాడనేది సిద్ధార్థ్‌రాయ్ చిత్ర కథన్నారు. నిర్మాత ఫణి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా తీశారని చెప్పారు. హీరోయిన్ తన్వి మాట్లాడుతూ ఈ చిత్రంలో ఇందు క్యారెక్టర్ చేశానని, ఎంతో ధైర్యవంతమైన యువతిగా కనిపిస్తానన్నారు. మరో నటి కీర్తన మాట్లాడుతూ ఈ చిత్రంలో కీర్తి క్యారెక్టర్ మంచి పేరు తీసుకొస్తుందన్నారు.

గైస్ అభివృద్ధికి కెమ్‌దోసా సహకారం



అవార్డులు అందుకున్న విద్యార్థులతో కెమ్‌దోసా సభ్యులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తుందని కెమ్‌దోసా సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గైస్‌లో అధ్యక్షుడు ఎ.వరహాలు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కెమికల్ ఇంజినీరింగ్ డిప్లొమా ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్(కెమ్‌దోసా) వార్షిక సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆమోదించారు. మొదటి బ్యాచ్(1971–75) నుంచి ప్రస్తుత బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ప్రసంగిస్తూ కాలేజీ అభివృద్ధికి కెమ్‌దోసా సహకారం ఆదర్శనీయమన్నారు. కెమికల్ ఇంజినీరింగ్, పెట్రోకెమికల్స్, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్, ఆయిల్ టెక్నాలజీ విభాగాల్లో డిసెంబర్–2023లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు, అన్ని విభాగాల్లో టాపర్లకు నగదు అవార్డులు ప్రదానం చేశారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో వివిధ సబ్జెక్టుల్లో టాపర్లకు ప్రత్యేక నగదు అవార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గైస్ ఎన్‌బీఏ గుర్తింపునకు అవసరమైన సహకారాన్ని తాము అందిస్తామని కెమ్‌దోసా సభ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, కెమ్‌దోసా కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు, కో ఆర్డినేటర్ ఎస్.జానీబాషా, కోశాధికారి కె.రమణ ప్రసాద్ పాల్గొన్నారు.

పౌర హక్కుల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న మళ్ల వెంకటరావు

సీతంపేట: పౌర హక్కుల పరిరక్షణకు 1948 డిసెంబర్ 10న పారిస్‌లో సమావేశమైన ఐక్య రాజ్య సమితి సర్వప్రతినిధి సభ ప్రతిజ్ఞ చేసిందని జాతీయ మానవ హక్కుల సమాఖ్య ఉపాధ్యక్షుడు మళ్ల వెంకటరావు అన్నారు. అక్కయ్యపాలెంలోని మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు కార్యాలయంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అహ్మద్ బాషా అధ్యక్షతన 'న్యాయం కావాలి' అనే నినాదంతో శనివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. వ్యక్తుల ప్రాథమిక హక్కులను నిర్వచించిన ఐక్య రాజ్య సమితి.. మనుష్యులందరూ సమానమని, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు లభిస్తాయని తీర్మానించనట్లు గుర్తుచేశారు. మావన హక్కుల చరిత్రలో ఆ ప్రకటన ఒక మైలురాయని, ఇది వెలువడిన నాటి నుంచి 77 ఏళ్లుగా స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం లభిస్తోందన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగినా, సమస్యలు ఎదురైనా పరిష్కారం కోసం మానవ హక్కుల సమాఖ్య ప్రతినిధులు ముందుండాలని పిలుపునిచ్చారు. సమాఖ్యను బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పూర్ణానందరావు, సతీష్‌కుమార్, బండి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

విశాఖలో తప్పిపోయిన అసోం యువకుడు



సూరజ్ కర్కి

తాటిచెట్లపాలెం: అసోం రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తప్పిపోయినట్లు అతడి బంధువులు శనివారం ఫిర్యాదు చేశారు. విశాఖ రైల్వే స్టేషన్ జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. గతేడాది నవంబర్ 24న అసోం రాష్ట్రం ఉదల్‌గురి జిల్లాకు చెందిన యువకుడు సూరజ్ కర్కి అక్కడి రంగియా రైల్వే స్టేషన్ నుంచి బెంగళూరుకు బయలుదేరాడు. ఈ యువకుడు మధ్యలో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో దిగాడు. ఇక్కడ నుంచి చివరిసారిగా తన అన్నయ్యతో ఫోన్‌లో మాట్లాడాడు. అనంతరం కొంతసేపటికి ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. ఈ ఘటనపై విశాఖ జీఆర్పీ స్టేషన్‌లో శనివారం యువకుడి అన్నయ్య ఫిర్యాదు చేశాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. యువకుడి మిస్సింగ్ గురించి ముందుగా అసోంలో ఫిర్యాదు చేయగా.. వారు విచారించి అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులకు పంపించారు. అసోం యువకుడి అదృశ్యంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు విచారణాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ యువకుడి గురించి ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో గానీ తెలియజేయాలని కోరారు.

కార్మికుల పోరాటానికి కేంద్రం దిగిరాక తప్పదు



దీక్షలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు పరిశ్రమ కార్మికుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,101వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రం విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేస్తామని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. పోరాటం చేయడం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కేంద్రం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సింహగిరిపై త్వరలో సహస్ర దీపాలంకరణ సేవ

- రూ.10 లక్షలతో కేంద్రం ఏర్పాటు
- భూమిపూజ చేసిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు



భూమిపూజ నిర్వహిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు

సింహాచలం : సింహగిరిపై త్వరలో సహస్రదీపాలంకరణ సేవను పునరుద్ధరించనున్నారు. ప్రత్యేకంగా రూ.10లక్షలతో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు శనివారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, వైదికులు, అధికారులు భూమి పూజ నిర్వహించారు. అలాగే స్వామివారి తిరువీధి వాహనాలు ఉంచేందుకు మరో రూ.10లక్షలతో వాహనశాల ఏర్పాటు పనులకు కూడా భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్ట్‌బోర్డు సభ్యులు మాట్లాడుతూ సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులతో పాటు, స్వామి సేవలకు సంబంధించిన పనులకు చేపట్టనున్నామన్నారు. గతంలో ప్రతీ శనివారం సాయంత్రం ఆలయ ఆస్థానమండపంలో సహస్ర దీపాలంకరణ సేవ ఉండేదని గుర్తుచేశారు. ఆసేవను మరింత వైభవంగా నిర్వహించేందుగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. త్వరలోనే రూ.54 కోట్లతో ప్రసాద్ స్కీమ్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మించిన కల్యాణమండపాలను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, సువ్వాడ శ్రీదేవి, దేవస్థానవం ప్రధాన పురోహితులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో నరసింగరావు, పీఆర్‌వో నాయుడు పేర్కొన్నారు.